TGTEL/25/A0977

# తొవ్వ

సామాన్యుని ఆవేదనకు అక్షర రూపమే నా తొవ్వకు స్ఫూర్తి

సంపుటి : 1 | సంచిక : 360 | బుధవారం 6-08-2025 | ఎడిటర్ : ముఖేష్ వీరంటి | పేజీలు: 5 | వెల : 5 రూ/.

## ఆగస్టులో యూరియా వినియోగం ఎక్కువ

**పాత బకాయిలతోపాటు ఈనెల కోటానూ ఇవ్వాలి**

**కేంద్రానికి మంత్రి తుమ్మల లేఖ**



హైదరాబాద్, ఆగస్టు 5: రాష్ట్రంలో ఆగస్టు నెలలో యూరియా వినియోగం ఎక్కువగా ఉంటుందని, దానిని దృష్టిలో ఉంచుకొని తగినంత యూరియా సరఫరా చేయాలని కేంద్రానికి రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. ఈ నెలలో ధాన్యం, పత్తి, మొక్కజొన్న లాంటి పంటలకు యూరియాను పైపాటుగా వాడుతారని, ఇలాంటి పరిస్థితుల్లో యూరియా సరఫరాలో ఎలాంటి ఆలస్యం తలెత్తినా పంటల దిగుబడులపై తీవ్ర ప్రభావం పడే అవకాశముందని మంత్రి పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పాత బకాయిలతో పాటు ఈనెల కోటా యూరియాను కూడా సరఫరా చేయాలని కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి జేపీ నడ్డాకు లేఖ రాసినట్లు ఆయన తెలిపారు.

## నాగారం భూములపై జోక్యం చేసుకోవద్దు

**పిటిషనర్‌కు ఫోన్ చేసిన కానిస్టేబుల్‌ను హెచ్చరించిన హైకోర్టు**

**హైదరాబాద్, ఆగస్టు 5:** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారం గ్రామంలోని సర్వేనంబర్లు 181, 182, 194, 195లలోని వివాదాస్పద భూముల వ్యవహారంలో జోక్యం చేసుకుంటే సస్పెన్షన్‌కు గురవుతారని పోలీసులను హైకోర్టు హెచ్చరించింది. పిటిషనర్‌ను బెదిరించడం, కేసును ఉపసంహరించుకోవాలంటూ ఒత్తిడి తేవడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుందని తేల్చిచెప్పింది. నాగారం భూములపై విచారణ కమిషన్ వేసేలా ప్రభుత్వానికి ఆదేశాలు జారీచేయాలని పేర్కొంటూ పడమటితండాకు చెందిన వడిత్య రాములు హైకోర్టులో పిటిషన్ వేసిన విషయం తెలిసిందే. సర్వే నంబర్ 194లో తన 10 ఎకరాల భూమిని అక్రమంగా బదలాయించుకున్నారని రాములు ఆరోపించారు. మహేశ్వరం పోలీసస్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ వెంకటేశ్ తనకు ఫోన్ చేసి బెదిరిస్తున్నారని.. ఆధార్ కార్డు పట్టుకుని పోలీసస్టేషన్‌కు రావాలని.. లేదా అరెస్ట్ చేస్తామంటున్నారని పేర్కొంటూ హైకోర్టులో మరో పిటిషన్ వేశారు. దీనిపై విచారణ చేపట్టిన జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం.. బెదిరించిన కానిస్టేబుల్ వెంకటేశ్‌ను మంగళవారం ధర్మాసనం ఎదుట హాజరుకావాలని ఆదేశించింది.

## మామ, అల్లుళ్లు మేడిగడ్డను కుంగబెట్టారు

**తప్పులు ఒప్పుకొని ప్రజలకు క్షమాపణలు చెప్పండి: మంత్రి ఉత్తమ్**



**హైదరాబాద్, ఆగస్టు 5:** మంత్రివర్గం ఆమోదం లేకుండానే కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించి కేసీఆర్, హరీశ్‌లు తెలంగాణ ప్రజలను మోసం చేశారని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. మామ, అల్లుళ్లు సంతకాలు చేసి రూ.లక్ష కోట్ల దుర్మార్గానికి పాల్పడ్డారని ధ్వజమెత్తారు. అలాంటి నాయకులకు మాట్లాడే హక్కు లేదన్నారు. వారు చేసిన పాపాలకు నాలుగు కోట్ల మంది రాష్ట్ర ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. తప్పిదాలను సమర్థించుకుంటూ న్యాయ వ్యవస్థనే అవమానిస్తారా? అని నిలదీశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలంటే బీఆర్ఎసకు చులకన భావమని.. చట్టసభలు, న్యాయస్థానాలంటే కూడా గౌరవం లేదని ఆరోపించారు. 'న్యాయ వ్యవస్థ మీద నమ్మకం లేదు. సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి సారథ్యంలో నియమించిన కమిషన్ అంటే కూడా లెక్కలేదు. ప్రజలు గత ఎన్నికల్లో బుద్ధి చెప్పినా ఇప్పటికీ వాళ్లలో మార్పు రాలేదు.

# కాళేశ్వరం నివేదిక.. కాంగ్రెస్ సర్కారు కుట్ర!

**రాజకీయ దురుద్దేశంతో ఏర్పాటు చేసిన కమిషన్ల నివేదికలు న్యాయస్థానాల్లో నిలబడవు**

**కేసీఆర్‌ను హింసించాలన్నదే ఉద్దేశం**

**కమిషన్ ఒకవైపే విచారించి నివేదిక ఇచ్చినట్టు ఉంది**

**కాళేశ్వరానికి అనుమతుల్లేవంటే.. కేంద్రాన్ని తప్పుబట్టినట్టే: హరీశ్‌రావు**



**హైదరాబాద్, ఆగస్టు 5:** కాంగ్రెస్ సర్కార్ కుట్రలో భాగంగానే కాళేశ్వరం కమిషన్ నివేదికను ముందుకు తెచ్చిందని.. ఏదో ఒకరకంగా కేసీఆర్‌ను బద్నాం చేయడమే వారి లక్ష్యంగా కనబడుతోందని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఆరోపించారు. రాజకీయ దురుద్దేశంతో ఏర్పాటు చేసిన కమిటీల నివేదికలేవీ న్యాయస్థానాల్లో నిలబడలేదన్నారు. గతంలో ఇందిరాగాంధీ, చంద్రబాబులపై ఇచ్చిన కమిషన్ నివేదికలు కూడా నిలబడలేదని గుర్తు చేశారు. 'కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ కుట్రలు.. కమిషన్ వక్రీకరణలు, వాస్తవాలు' అనే అంశంపై మంగళవారం తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. "కేసీఆర్‌ను హింసించాలన్నదే రేవంత్‌రెడ్డి ఉద్దేశం. అందుకే టీవీ సీరియళ్ల మాదిరిగా కాళేశ్వరం, విద్యుత్ అంటూ వరుస కమిషన్లను ముందుకుతెచ్చి ఏదోచేయాలని చూస్తున్నారు. కుట్రపూరితంగానే కమిషన్ విచారణ జరిగినట్టు కనబడుతోంది. 665 పేజీల నివేదికలో కొన్ని అంశాలంటూ బయటపెట్టారు. అవి నిజంగా ఆ నివేదికలో ఉన్నాయా, లేదా అన్న అనుమానం కలుగుతోంది. ఒకవేళ వారు చెప్పిందే నిజమైతే.. కమిషన్ కాంగ్రెస్ సర్కారుకు అనుకూలంగా ఒకవైపే చూసి, విని, వారివైపే నిలబడి నివేదిక ఇచ్చిందన్న అనుమానం కలుగుతోంది. స్థానిక ఎన్నికల నేపథ్యంలో తప్పుడు ప్రచారానికి తెరతీశారు. దురుద్దేశంతో కేవలం 60 పేజీలను బయటపెట్టారు. మొత్తం 665 పేజీల్లో అంశాలను అసెంబ్లీలో పెట్టాలి. గట్టిగా సమాధానం చెబుతాం" అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు అనుమతులు లేవనడం చూస్తే కేంద్ర ప్రభుత్వాన్నే తప్పుబట్టినట్లుగా ఉందని హరీశ్‌రావు పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో రహస్యాలేమీ లేవని, అన్ని అంశాలు డీపీఆర్‌లో ఉన్నాయని చెప్పారు. పదకొండు కేంద్ర ప్రభుత్వ ఏజెన్సీలు ప్రాజెక్టును ఆమోదించాయని.. కమిషన్ ఆ ఏజెన్సీలను తప్పుబడుతోందా, ఎవరిని తప్పుబడుతుందని ప్రశ్నించారు. "ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టుకు హైడ్రాలజీ క్లియరెన్స్ ఉందంటూ నాటి కేంద్ర మంత్రి ఉమాభారతి తెలంగాణ ప్రభుత్వానికి రాసిన లేఖలో పేర్కొన్నారని కమిషన్ నివేదికలో ప్రస్తావించారు. కానీ అదే లేఖలోని మూడో పేజీలో 160 టీఎంసీల నీటి లభ్యత ఉండకపోవచ్చని కేంద్ర మంత్రి స్పష్టంగా పేర్కొన్న విషయాన్ని కమిషన్ గుర్తించలేదా? ప్రభుత్వం కావాలనే దాచిపెట్టిందా?" అని హరీశ్‌రావు నిలదీశారు. తుమ్మిడిహెట్టి వద్ద నీటి లభ్యత లేదని, 152 మీటర్ల ఎఫ్ఆర్ఎల్ (గరిష్ట నీటి మట్టం)కన్నా తక్కువ ఎత్తుతో బ్యారేజీ నిర్మిస్తే నిరుపయోగం అవుతుందని సీడబ్ల్యూసీ పలు సందర్భాల్లో హెచ్చరించిందని హరీశ్‌రావు గుర్తు చేశారు. "152 మీటర్ల ఎత్తుకు ఒప్పుకోబోమని, 148 మీటర్ల ఎత్తు అయితే అంగీకరిస్తామని అప్పట్లో మహారాష్ట్ర ప్రభుత్వం తేల్చిచెప్పింది. దానికితోడు ప్రతిపాదిత ప్రాంతం అభయారణ్యంలో ఉండటంతో అనుమతులు క్లిష్టతరం. కాలయాపన తప్ప మరోటి లేదు. దీనికి అనుగుణంగానే సీడబ్ల్యూసీకి సమర్పించిన కాళేశ్వరం డీపీఆర్‌లో తుమ్మిడిహెట్టి వద్ద నీటి లభ్యత లేదని స్పష్టంగా తెలిపాం. దానిని సీడబ్ల్యూసీ ఆమోదించింది.

# ఉత్తరాఖండ్‌లో జలప్రళయం

**2 గంటల వ్యవధిలో రెండుసార్లు మేఘవిస్ఫోటం**

**నలుగురి మృతి.. 70 మందికి పైగా గల్లంతు**



**న్యూఢిల్లీ, ఆగస్టు 5:** ఉత్తరాఖండ్‌లోని ఉత్తరకాశీ జిల్లా ధరాలీ గ్రామాన్ని జలప్రళయం ముంచెత్తింది! మంగళవారం మధ్యాహ్నం 1.45 గంటల సమయంలో.. క్లౌడ్‌బరస్ట్ (మేఘ విస్ఫోటం- ఒకేచోట కుండపోతగా వర్షం కురవడం) దెబ్బకు ప్రళయవేగంతో దుంకిన గంగమ్మ (ఖీర్ గంగానది).. దారిలో ఉన్న చెట్టు, చేమ, బురదను కలుపుకొని కిందికి ప్రవహించింది! కొండచరియలను సైతం నుగ్గునుగ్గు చేస్తూ దూసుకొచ్చిన ఆ వెల్లువ ధాటికి గ్రామంలోని ఇళ్లు, పెద్ద పెద్ద భవనాలు పేకమేడల్లా నేలకూలాయి. గుండెలదిరేలా హోరుమనే శబ్దంతో కమ్ముకొస్తున్న జలప్రళయం నుంచి తప్పించుకునేందుకు.. ప్రజలు ప్రాణాలు అరచేత పెట్టుకుని.. పెద్దపెట్టున ఆర్తనాదాలు చేస్తూ పరుగులు తీశారు! కానీ.. కన్నుమూసి తెరిచేంతలోనే వరద బురద వారిని ముంచెత్తిన దృశ్యాలు సోషల్‌మీడియాలో వైరల్ అవుతున్నాయి. మొదటి మేఘవిస్ఫోటం జరిగిన రెండు గంటల వ్యవధిలోనే.. అదే ప్రాంతంలోని సుఖీ పర్వతప్రాంతంపై మరో మేఘవిస్ఫోటం జరిగింది. దీంతో మరోసారి కొండలమీద నుంచి నీరు ధరాలీ గ్రామాన్ని ముంచెత్తింది. అధికారిక సమాచారం ప్రకారం ఈ విలయంలో ఇప్పటిదాకా నలుగురు మరణించగా.. 11 మంది సైనికులు సహా 70 మందికి పైగా గల్లంతయ్యారు! అయితే.. మృతుల సంఖ్య భారీగా ఉండొచ్చని స్థానికులు చెబుతున్నారు. ప్రవాహంలో 20-25 హోటళ్లు కొట్టుకుపోయాయని రాజేశ్ పన్వర్ అనే స్థానికుడు తెలిపారు. "చూస్తూండగానే ఇళ్లు, మార్కెట్లు, హోటళ్లు తుడిచిపెట్టుకుపోయాయి. ఇలాంటి విలయాన్ని నేను ఇంతకుముందెన్నడూ చూడలేదు" అని మరో ప్రత్యక్షసాక్షి తెలిపారు. వరదనీరు, విరిగిపడ్డ కొండచరియల కారణంగా ఆ ప్రాంతంలోని ఐదు జాతీయరహదారులు, ఏడు రాష్ట్ర రహదారులు సహా మొత్తం 163 రహదారుల్లో రాకపోకలు నిలిచిపోయాయి. కాగా.. వరద చుట్టుముట్టిన పదినిమిషాల వ్యవధిలోనే సమీపంలో ఇండియన్ ఆర్మీ రంగంలోకి దిగింది. ధరాలీకి 4-5 కిలోమీటర్ల దూరంలో ఉన్న హర్షిల్ క్యాంప్ నుంచి నుంచి 150 మంది సైనికులు అక్కడికి చేరుకుని విపత్తు స్పందన చర్యలు చేపట్టారు. ముంపులో చిక్కుకుపోయిన స్థానికులను కాపాడి సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఆ తర్వాత కొద్దిసేపటికి.. ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటీబీపీ) బృందాలు చేరుకున్నాయి. ఉత్తరాఖండ్ రాష్ట్ర విపత్తు స్పందన దళాలు, జాతీయ విపత్తు స్పందన దళాలు, ఉత్తరకాశీ జిల్లా యంత్రాంగం.. అంతా కలిపి 400 మందికిపైగానే సహాయకచర్యలో పాల్గొంటున్నారు. క్యాంపు దెబ్బతిని, 11 మంది సైనికులు గల్లంతైన క్లిష్టపరిస్థితుల్లోనూ మన సైనికులు ఎలాంటి ఒత్తిడికీ లోనుకాకుండా, దృఢనిశ్చయంతో సహాయకచర్యల్లో పాల్గొనడం వారి నిబద్ధతకు, ధైర్యానికి నిదర్శనం అని ఆర్మీ ఒక ప్రకటన ద్వారా తెలిపింది. మరోవైపు.. ధరాలీ ప్రాంతంలో మంగళవారం ఒక్కరోజే 21 సెం.మీ.వాన కురవడంతో వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ ప్రకటించింది.

## అబద్దాన్ని నిజం చేసేందుకు హరీశ్ తాపత్రయం

**మామ కళ్లలో ఆనందం కోసం పాట్లు: మంత్రి పొంగులేటి**



**కూసుమంచి, ఆగస్టు 5:** కాళేశ్వరం ప్రాజెక్టుపై అబద్ధాలను నిజం చేయడానికి బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి టీ హరీశ్ రావు ప్రయత్నిస్తున్నారని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు తానే కర్త, కర్మ, క్రియ అని మాజీ సీఎం కేసీఆర్ పేరు 33 సార్లు, మామ కళ్లలో ఆనందం చూసేందుకు తాపత్రయ పడ్డ హరీశ్‌రావు పేరు 20 సార్లు కమిషన్ నివేదికలో ప్రస్తావించారన్నారు. ఖమ్మం జిల్లా కూసుమంచిలోనిమంత్రి పొంగులేటి మీడియాతో మాట్లాడారు. కమిషన్ నివేదిక వచ్చినప్పటి నుంచి బీఆర్ఎస్ నేతలు భయభ్రాంతులకు గురవుతున్నారని ఎద్దేవా చేశారు.

## నేడు, రేపు భారీ వర్షాలు

**హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి**

**పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ**



**హైదరాబాద్, ఆగస్టు 5:** రాష్ట్రంలో మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. బుధ, గురువారాల్లో కొన్ని జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఈ మేరకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. గురువారం ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, ములుగు, సూర్యాపేట, నల్లగొండ, నాగర్‌కర్నూల్, యాదాద్రి భువనగిరి, జనగాం, పెద్దపల్లి, కరీంనగర్, మంచిర్యాల, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, మేడ్చల్, హైదరాబాద్, రంగారెడ్డి, సిరిసిల్ల, సిద్దిపేట జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది.

# ఢిల్లీలో రేవంత్ ధర్నా ఓ డ్రామా

**బీసీలపై చిత్తశుద్ధి ఉంటే ముందుగా.. విద్య, ఉద్యోగాల్లో 42% రిజర్వేషన్లు కల్పించండి**

**హామీలు నెరవేర్చకుంటే అనర్హత వేటేయాలి**

**కాళేశ్వరం నివేదికను బయట పెట్టాలి: కేటీఆర్**



**న్యూఢిల్లీ/హైదరాబాద్, ఆగస్టు 5:** ఢిల్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీల పేరుతో చేసే ధర్నా ఓ డ్రామా అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. బీసీలపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే ముందు విద్య, ఉద్యోగాల్లో 42% రిజర్వేషన్లు కల్పించాలన్నారు. బీసీ రిజర్వేషన్లు కేంద్రం చేతిలో పనని చెబుతున్న రేవంత్.. ఆయన చేతిలోనే ఉన్న మిగిలిన హామీలు ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. ఇకనైనా ఢిల్లీలో డ్రామాలు, ఓట్ల కోసం డైలాగులు ఆపి.. బీసీలకు ఇచ్చిన మిగిలిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కేంద్రాన్ని సాకుగా చూపి కాలయాపన చేస్తామంటే, స్థానిక ఎన్నికల్లో ప్రజలే గుణపాణం చెబుతారని హెచ్చరించారు.

మంగళవారం ఢిల్లీలోని కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) కార్యాలయంలో ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్, కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషీలతో కేటీఆర్ భేటీ అయ్యారు. ఆయనతో పాటు బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యులు కేఆర్ సురేశ్ రెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎంపీలు వినోద్ కుమార్, బాల్క సుమన్ ఉన్నారు. అనంతరం ఈసీఐ కార్యాలయం ఎదుట కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. దేశ ప్రజల్లో ఈవీఎంలపై అనేక అనుమానాలు ఉన్నాయని, మళ్లీ బ్యాలెట్ పద్ధతిలోనే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికలతోనే బ్యాలెట్ విధానానికి శ్రీకారం చుట్టాలని కోరారు. బిహార్‌లో లోపాలను అరికట్టకపోతే, రాబోయే ఎన్నికల్లో తెలంగాణలోనూ ఇదే పరిస్థితి నెలకొంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీలను అమలు చేయుకంటే ఆ అభ్యర్థి సభ్యత్వం రద్దు చేయాలని, వారు ఎన్నికల్లో పోటీ చేయకుండా అనర్హత వేటు వేయాలని ఎన్నికల సంఘాన్ని కోరినట్టు కేటీఆర్ తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్ 420 హామీలు ఇచ్చి ప్రజలను మభ్యపెట్టి గెలిచిన తర్వాత హామీలన్నీ గాలికి వదిలేసిందని మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ ఘోష్ కమిషన్ నివేదిక అంతా ట్రాష్, గ్యాస్ అని కేటీఆర్ కొట్టిపారేశారు. 665 పేజీల నివేదికను 60 పేజీలకు కుదించడంతోనే కాంగ్రెస్ డ్రామా ప్రజలకు అర్థమైపోయిందన్నారు. రేవంత్‌కు దమ్ముంటే.. వెంటనే పూర్తి నివేదికను బహిర్గతం చేయాలని, అసెంబ్లీలో చర్చకు పెట్టి మైక్ కట్ చేయకుండా తమ వాదన వినిపించే అవకాశం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. హైదరాబాద్ వాసులకు కేసీఆర్ అందించిన ఉచిత మంచినీటి పథకాన్ని ముట్టుకుంటే సీఎం రేవంత్‌రెడ్డి మసేనని కేటీఆర్ ఎక్స్ వేదికగా కేటీఆర్ హెచ్చరించారు.

## బీసీ రిజర్వేషన్ల సాధనకు నేడు ఢిల్లీలో సమరం

**న్యూఢిల్లీ/హైదరాబాద్, ఆగస్టు 5 :** బీసీ రిజర్వేషన్ల పోరాటం దేశ రాజధాని ఢిల్లీ చేరుకుంది. ఎంత జనాభాకు అంత వాటా అనే రాహుల్‌గాంధీ నినాదాన్ని ఆచరణలో పెట్టేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ఉద్యమిస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికలు, విద్య, ఉపాధి రంగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లులను పార్లమెంట్‌లో ఆమోదించాలని కోరుతూ బుధవారం జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేపట్టనుంది. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ ధర్నా నిర్వహించనున్నారు. ముఖ్యమంత్రి తోపాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ల చైర్మన్‌లు, బీసీ సంఘాల నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొనను న్నారు. ఇందుకోసం సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, కొండా సురేఖ, వివిధ జిల్లాల కాంగ్రెస్ నాయకులు మంగళవారం సాయంత్రానికి ఢిల్లీ చేరుకున్నారు.

# అన్నదాతలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

**వ్యవసాయంపై పరిశోధనకు మా ఫామ్ హౌస్ ను ఉపయోగించుకోవచ్చు,**

**రైతులు పట్టణాలకు వలస పోవద్దు - మెలుకువలు తెలుసుకుంటే వ్యవసాయం లాభసాటి,**

**కిసాన్ పరివార్ అధినేత నానావత్ భూపాల్ నాయక్**



**తొవ్వా న్యూస్ ప్రతినిధి, కురవి ఆగస్టు 5,**

డోర్నకల్ నియోజకవర్గం లోని అన్నదాతలు పారిశ్రామిక వేత్తలు గా ఎదిగిన నాడే నియోజకవర్గ అభివృద్ధి చెందినట్లు అని కిసాన్ పరివార్ అధినేత నానావత్ భూపాల్ నాయక్ అన్నారు. మంగళవారం తొవ్వా న్యూస్ ప్రతినిధితో ఆయన మాట్లాడుతూ డోర్నకల్ నియోజకవర్గం రైతులు అభిమానులు హైదరాబాద్ కొండాపూర్ లోని తన కార్యాలయంలో రైతులు పారిశ్రామికవేతలుగా ఎలా ఎదగాలి అనే విషయంపై ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వ్యవసాయ మీద ఆధారపడే రైతులు పరిజ్ఞానంతో మెలుకువలతో వ్యవసాయాన్ని లాభసాటిగా చేసుకొని పంటలు పండించవచ్చని ఆయన తెలిపారు. వ్యవసాయం చేసే ప్రతి అన్నదాత పారిశ్రామికవేతగా ఎదగాలన్నది తన ఆకాంక్ష అని తెలిపారు. వ్యవసాయంపై పలు పరిశోధనలు చేసేందుకు తన (ఫామ్ హౌస్) వ్యవసాయ క్షేత్రాన్ని ప్రభుత్వం వ్యవసాయ శాఖ, హార్టికల్చరల్ అధికారులు సంయుక్తంగా ఉపయోగిం చుకోవచ్చు అని సూచించారు. డోర్నకల్ నియోజకవర్గం వ్యవసాయానికి అనుసంధానం అయిన ప్రాంతమని ముందుగా నియోజకవర్గాన్ని వ్యవసాయంలో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుత తరుణంలో వ్యవసాయాన్ని భారంగా పరిగణిస్తున్న రైతులు మెలకువలతోటి నేటి ఆధునిక పరిజ్ఞానం యాంత్రీకరణలతోటి వ్యవసాయాన్ని లాభసాటిగా చేసుకోవచ్చని సూచించారు. వ్యవసాయం చేసే అన్నదాతలు పొట్ట చేతు పట్టుకొని పట్టణాలకు పోతున్నారని ప్రభుత్వం రైతులు పట్టణాలకు వెళ్లకుండా వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు ప్రైవేటు వ్యక్తులను కూడా ప్రోత్సహించి వ్యవసాయం లో విప్లవాత్మక మార్పులు దేశరావాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. నా వ్యవసాయ క్షేత్రంలో నేను వ్యవసాయం చేస్తున్న అందులో ఒక భాగం మాత్రమే, వ్యవసాయ క్షేత్రాన్ని పలు రకాలుగా పలు రకాల విత్తనాలు వంగడాలు తయారు చేసేందుకు పండించేందుకు శాస్త్రవేత్తలు అనుభవజ్ఞులైన రైతులు నా వ్యవసాయ క్షేత్రాన్ని ఉపయోగించుకోవచ్చు అని రైతులకు ఎల్లప్పుడూ నా వ్యవసాయ క్షేత్రం లోని రైతులు రైతు కూలీలు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈ ప్రాంత వెనుకబడిన ప్రాంతంగా గిరిజన ప్రాంతంగా ఉన్న నియోజకవర్గాన్ని మండలంలోని ఒక్కొక్క గ్రామంలో ఒక యువకున్ని తీసుకొని కుటీర పరిశ్రమల్లో మెలుకువలు నేర్పి వారిని వారి కాళ్ళ మీద నిలబడే విధంగా తయారుచేసి స్వయం సహాయక బృందాలుగా ఏర్పాటు చేసి వారు తయారు చేసే సామాగ్రిని కిసాన్ పరివార్ సంస్థ కొనుగోలు చేస్తుందని తద్వారా తయారుచేసిన పదార్థాలను ఎగుమతులు ద్వారా ఇతర దేశాలకు సప్లై చేస్తామని అందుకు ప్రభుత్వం సహకరించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈ కుటీర పరిశ్రమల ద్వారా నిరుద్యోగులను ఉపాధి కల్పించినట్టు అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు డివైగిరి. నున్న రమణ. రైతులు తదితరులు పాల్గొన్నారు.

# జగనా తండాలో పోలీసుల కార్డెన్ సెర్చ్

**-సిఐ రవికుమార్**



**బయ్యారం,తోవ్వ,ఆగస్టు 5.**

మండలంలోని బాల్య తండా గ్రామపంచాయతీ పరిధిలోని జగనా తండాలో మంగళవారం జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్ ఆదేశాలతో సిఐ రవికుమార్, ఎస్ఐ తిరుపతి ఆధ్వర్యంలో తమ సిబ్బందితో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు .కార్డెన్ చర్చ్ సందర్భంగా సరైన పత్రాలు,నెంబర్ ప్లేట్ లేని 13 టూ వీలర్ వాహనాలను,బెల్టుషాపులలో 5000 రూపాయల విలువగల మద్యం బాటిల్స్ సిజ్ చేసి, 600 లీటర్ల గుడుంబా పానకం, 40 లీటర్ల గుడుంబా ను ధ్వంసం చేసినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. ఈ సందర్భంగా సీఐ రవికుమార్ మాట్లాడుతూ చట్టానికి వ్యతిరేకంగా ఏ కార్యక్రమాలు చేసినా అది నేరమని, చట్టానికి లోబడి ప్రతి వ్యక్తి నడుచుకోవాలని, లేనియెడల క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో గార్ల ఎస్సై పాషా, 40 మంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నట్లు తెలిపారు.

# కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేఖ విధానాలను ఎండ కట్టాలి

**సిపిఎం జిల్లా కార్యదర్శి సాధుల శ్రీనివాస్**



తొవ్వ, మహబూబాబాద్ ప్రతినిధి, ఆగష్టు 05: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరించి ప్రజాస్వామ్యం కూని చేస్తున్న విధానాలను ఎండ కట్టాలని మహబూబాబాద్ జిల్లా సీపీఎం కార్యదర్శి సాధుల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మంగళవారం మహబూబాబాద్ పట్టణంలోని భూ పోరాట సమస్యలపై సర్వే నిర్వహించారు. పట్టణ కార్యదర్శి బానోత్ సీతారాం అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సాధుల శ్రీనివాస్ మాట్లాడుతూ... కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కులాల మతాల మధ్య వైరుధ్యాలు పెంచి, మతోన్మాదాన్ని పెంచి పోషిస్తున్నదని అన్నారు. ప్రతి ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మతోన్మాద ఎజెండాలు ముందుకు తెచ్చి ఇండియా, పాకిస్తాన్ యుద్ధం అంటూ బీహార్, బెంగాల్ ఎన్నికల్లో లబ్ధి కొరకై ఆపరేషన్ సిందూర్ అంటున్నారని అన్నారు. రాష్టంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అర కొరగా అమలు చేస్తున్నదని అన్నారు. రాష్టంలో ఇందిరమ్మ ఇండ్లలో ఇంటి జాగా, పట్టాలు లేని వారికి ఇండ్లు రాదని చెప్పటం నిజమైన అర్హులను ప్రభుత్వ పథకాలు రాకుండా అన్యాయం చేస్తున్నారని, అధికారులు సమగ్రసర్వే చేసి న్యాయం చేయాలనీ డిమాండ్ చేసారు. రాష్టంలో పింఛన్లు రాక చాలా మంది అర్హులు చెప్పులు అరిగేలా కార్యాలయం చుట్టూ తురుగుతున్నారన్నారు. పింఛన్లు లను ప్రభుత్వం ఇవ్వక పోవడం దారుణం. వెంటనే ప్రభుత్వం పింఛన్లు మంజూరు జూరి చేయాలని డిమాండ్ చేసారు. 2014 నుంచి ఇప్పటివరకు వరకు ఇండ్లు కట్టుకున్న ఇంటి యజమానికి యాజమాన్య ధ్రువీకరణ పత్రం కానీ ఇంటి నెంబర్ కానీ ఇవ్వకపోవడంతో కరెంట్ మీటర్స్ లేక ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారని అన్నారు. వెంటన్నే అధికారులు ఇల్లు కట్టుకున్న వాళ్లకు ఇంటి నెంబర్ లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత 3 సం నుంచి సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో భూ మాఫియా చేతుల్లో ఖాబ్జాకు గురి అయిన ప్రభుత్వ భూమిని గుర్తించి, భూ పోరాటం నిర్వహించి, ఇండ్లు లేని నిరు పేదలకు ఇంటి స్థలాలు ఇచ్చిన ఘనత సిపిఎం పార్టీ దే అన్నారు. అనేక అక్రమ కేసులు పెట్టి ప్రజలను పార్టీ నాయకులను జైలుకు పంపిన ఎత్తిన జండాను దించ కుండా పోరాటాన్ని కొనసాగిస్తున్నామని అన్నారు. ప్రభుత్వం, అధికారులు వెంటనే పట్టాలు ఇచ్చి ఇందిరమ్మ ఇండ్లు కట్టించాలని డిమాండ్ చేసారు. లేని యెడల ప్రజా అగ్రహానికి గురికాక తప్పదాని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సూర్నపు సోమయ్య, శాఖ కార్యదర్శులు,పార్టీ సభ్యులు, సానుభూతి పరులు, తదితరులు పాల్గున్నారు.

# ప్రభుత్వ కళాశాలలను బలోపేతం చేయడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

**ఇంటర్ జాయింట్ సెక్రెటరీ వసుంధర దేవి**



**తొవ్వ, నెల్లికుదురు, ఆగస్టు 05**

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్ లను పెంచడంతోపాటు, వాటిని బలోపేతం చేయడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఇంటర్ జాయింట్ సెక్రెటరీ వసుంధర దేవి అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆమెసందర్శించి, మౌలిక వసతులను గురించి వివరాలను ప్రిన్సిపాల్ ను అడిగితెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థిని విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అందించే నాణ్యమైన విద్యను అందుకొని, జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అన్నారు. పోటీ ప్రపంచంలో నూతన ఒరవడిని సృష్టించి రానున్న పోటీ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించడానికి ఫిజిక్స్ వాలా, క్లాట్ వంటి శిక్షణా తరగతులను విద్యార్థులకు ఆన్లైన్ మరియు ఆఫ్లైన్ విధానంలో అందించడం జరుగుతుందని తెలిపారు. అధ్యాపకులు విద్యార్థులకు. సెల్ ఫోన్ వినియోగంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, మాదకద్రవ్యాల అలవాటు పట్ల ఆకర్షితులు కాకుండా వాటి వల్ల జరిగే అనర్థాలను వివరించి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అరిగకూటి శ్రీనివాస రెడ్డి అధ్యాపక బృందం శ్రీనివాస్, ప్రకాష్ బాబు, రఘురాం, బాబు, నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, రామ్మూర్తి, మహేందర్, అనిల్ కుమార్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ప్రభుత్వ పాఠశాలలోవిద్యార్థులకు అందుబాటులో గ్రంథాలయ పుస్తకాలు

**మండల విద్యాశాఖ అధికారి ఏ.రాందాస్ నాయక్**




**తొవ్వ,నెల్లికుదురు, ఆగస్టు 05**

రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు విజ్ఞానాన్ని పెంపొందించే లక్ష్యంతో గ్రంథాలయ పుస్తకాలను అందుబాటులోకి తేవడం జరిగిందని మండల విద్యాశాఖ అధికారి ఏ రామ్ దాస్ తెలిపారు.స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో మంగళవారం మండలంలోని ప్రభుత్వ పాఠశాలలన్నింటికీ ప్రభుత్వం విద్యాశాఖ ద్వారా పంపిణీ చేయబడిన గ్రంథాలయ పుస్తకాలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రాథమిక ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు వారికి కేటాయించబడిన లైబ్రరీ మెటీరియల్స్ ని అందించినట్టు తెలిపారు విజ్ఞానాన్ని వినోదాన్ని అందించే లైబ్రరీ బుక్స్ విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు ప్రతి విద్యార్థి గ్రంథాలయ పుస్తకాలువినియోగించుకునేలా ఉపాధ్యాయులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మధ్యాహ్న భోజనము, ఏకరూప దుస్తులు, నోటుబుక్కులు , రవాణా చార్జీలుతదితర ఎన్నో ఉచిత సౌకర్యాలు అందుబాటులో ఉండడంతో పాటు పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలను సాధించి విద్యార్థులు ట్రిబుల్ ఐటీ బాసరలో సీటు సాధిస్తున్నారని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపించకుండా ప్రభుత్వ పాఠశాలలకే పంపించి వాటి అభివృద్ధికి తోడ్పాటున అందించాలని తెలిపారు ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సొంటి రెడ్డి యుగంధర్ రెడ్డి, సైదుల్ పాషా, బానోతు లక్ష్మణ్, గాయపులింగారెడ్డి, మండల ఎం ఐ ఎస్ కోఆర్డినేటర్ మస్కపురి సుధాకర్ ,కంప్యూటర్ ఆపరేటర్ హెచ్ ఉపేందర్, సి ఆర్ పి లు ఏ భాస్కరరావు, బి వీరస్వామి, జె కవిత తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల పిల్లలకి విద్యా సంస్థల్లో రాయితీ ఇవ్వాలి

**డిఎస్ఎఫ్ఐ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వివేక్**

**తొవ్వ, మహబూబాబాద్ ప్రతినిధి, ఆగష్టు 05:**



ఇతర జిల్లాలో జర్నలిస్టుల పిల్లలకు రాయితీ ఇచ్చినప్పుడు మహబూబాబాద్ జిల్లాలో ఎందుకు ఇవ్వడం లేదని డిఎస్ఐఎఫ్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ వివేక్ ప్రశ్నించారు. మంగళవారం మహబూబాబాద్ జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్ రెడ్డి తో ఫోన్ లో మాట్లాడినట్లు ఒక ప్రకటనలో తెలిపారు.

# విద్యార్థులకు మానసికోల్లాసం ముఖ్యం మధుపతి విశాల

**తొవ్వ, ప్రతినిధి. ఆగస్ట్ 05**




విద్యార్థులకు మానసిక ఉల్లాసం చాలా ముఖ్యమై నదని యామిని తేజ్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ ప్రెసిడెంట్ మదుపతి విశాల అన్నారు. మంగళవారం మహబూబాబాద్ జిల్లా సింగారం ప్రాథమికోన్నత పాఠశాలకు యామిని తేజ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మార్చ్ ఫాస్ట్ డ్రమ్ డొనేట్ చేశారు. ఈ సందర్భంగా విశాల మాట్లాడుతూ విద్యార్థులకు క్రీడలు, స్కౌట్, మార్చి ఫాస్ట్ ద్వారా క్రమశిక్షణతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని చెప్పారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వినయ్ కుమార్ తో ఉపాధ్యాయనీ, ఉపాధ్యాయులు నరేష్, శ్రీనివాసులు, సబిత, సునిత విద్యార్థులు పాల్గొన్నారు.

# పేదల అభివృద్ధి కాంగ్రెస్ తోనే సాధ్యం

## బ్లాక్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ నన్నెబోయిన రమేష్ యాదవ్



**తొవ్వ, ప్రతినిధి, చెన్నరావుపేట, ఆగస్ట్, 05:**
పేదల అభి వృద్ధి కాంగ్రెస్ పార్టీ ద్వారానే సాధ్యమవుతుందని పేదోడి కళని నేడు ఇందిరమ్మ రాజ్యం కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేస్తుందని పల్లెల్లో ఇందిరమ్మ ఇండ్ల పండుగ సంబరాలు జరుగుతున్నాయని బ్లాక్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ నన్నెబోయిన రమేష్ యాదవ్ అన్నారు..ఇందిరమ్మ ఇండ్లతో పేదోడి కల సాకారం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మండల కేంద్రంలో ఇందిరమ్మ లబ్ధిదారు బొబ్బ యాదమ్మ కి నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు ఈ రోజు ఇందిరమ్మ గృహ నిర్మాణానికి ముగ్గు పోసి భూమి పూజ చేశారు..ఈ కార్యక్రమంలో పాల్గొన్న బ్లాక్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ నన్నెబోయిన రమేష్ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లను ప్రతి పేద వాడికి అందించాలనే సంకల్పంతో ఉందని వారు అన్నారు.. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి గారి సహకారంతో నియోజకవర్గం లోని గ్రామాలలో ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ సంక్షేమ ఫలాలు అందుతాయని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు త్వరగా ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేయాలని వారు అన్నారు..పల్లె పల్లెల్లో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు ఇండ్ల నిర్మాణాన్ని చేపట్టి ఆర్థికంగా పేదోడి కలను నెరవేర్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నారు..ఊరూరా సంబరాలు చేసుకుంటున్నారని ఆయన అన్నారు..ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు మాజీ ఎంపీటీసీ గుగులోత్ ఈర్యా నాయక్ కాంగ్రెస్ మండల కార్యదర్శి చెవ్వ వెంకన్న బీసీ సెల్ మండల కార్యదర్శి చెవ్వ సంపత్ ఎస్టీ సెల్ మండల ఉపాధ్యక్షుడు గుగులోత్ నాని సీనియర్ నాయకులు మెంతుల రమేష్ చెవ్వ బక్కన్న జయేందర్ రెడ్డి నన్నెబోయిన భిక్షపతి కంది నారాయణ రెడ్డి దొంతి శ్రీను వల్ల సదయ్య బండారి సతీష్ సంతోష్ బొబ్బ లక్ష్మి వెంకటమ్మ భద్రమ్మ రాధిక రఫి క్రిష్ణమాచారి కుమార స్వామి గ్రామ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు..

# మాజీ సర్పంచ్ ని పరామర్శించిన కాంగ్రెస్ మండల అధ్యక్షుడి పరామర్శ



**తొవ్వ, ప్రతినిధి, చెన్నారావుపేట, ఆగస్టు,05:**
చెన్నారావుపేట మండలం అమీనాబాద్ తండా గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ జాటోత్ స్వామి నాయక్ తండ్రి మానుఅనారోగ్యంతోమరణించగా విషయాన్ని తెలుసుకున్న కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సిద్దన రమేష్ ఆయన స్వ గృహానికి చేరుకొని జాటోతు మాను పార్థీవ దేహానికి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సిద్ధన రమేష్ పూలమాల వేసి నివాళులర్పించారు..అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈకార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మంద యాకయ్య గౌడ్ యువజన కాంగ్రెస్మండల అధ్యక్షుడు బండి హరీష్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ చీర అశోక్ శంకరం తండా మాజీ సర్పంచ్ భూక్య బద్రు అమీనాబాద్ మాజీ ఉప సర్పంచ్ఊరుకొండలింగస్వామి అమీనాబాద్ తండ గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు భానోత్ రవికుమార్ మాజీ వార్డ్ సభ్యులు మురహరి శంకర్ జాటోత్ రఘు దారావత్ రాములు మిల్కూరి దామోదర్ రెడ్డి గుండెబోయిన రమేష్ మిల్కూరి రవీందర్ రెడ్డి బానోత్ సక్రు బండి దిలీప్ దార రంజిత్ కర్నూరి రఘు నాంపల్లి అబ్బయ్య పోతురాజు నరసయ్య అయిత తిరుపతి పల్లకొండ నర్సయ్య ఇమామ్ తదితరులు పాల్గొన్నారు.

# 42 శాతం బీసీ రిజర్వేషన్ల అమలకు వెంటనే పార్లమెంట్లో చట్టం చేయాలి

## CPM డిమాండ్



**యాదాద్రి జిల్లా: వలిగొండ: తొవ్వ ప్రతినిధి :ఆగస్టు 5**
దేశవ్యాప్తంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేసేందుకు పార్లమెంటులో వెంటనే చట్టం చేయాలని బీసీ రిజర్వేషన్ల అమలుపై నోరు మెదపకుండా రిజర్వేషన్లకు వ్యతిరేకంగా మాట్లాడుతున్న బిజెపి తెలంగాణ ఎంపీలు వెంటనే రాజీనామా చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మద్దెల రాజయ్య, మండల కార్యదర్శి సిర్పంగి స్వామి లు డిమాండ్ చేశారు మంగళవారం వలిగొండ మండల కేంద్రంలోని భువనగిరి నల్గొండ రహదారిపై సిపిఎం ఆధ్వర్యంలో 42 శాతం బీసీ రిజర్వేషన్లను వెంటనే పార్లమెంట్లో చట్టం చేసి అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రాస్తారోకో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మద్దెల రాజయ్య,సిర్పంగి స్వామి లు మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం 42 శాతం బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా మాట్లాడడం బిజెపి మనువాద భావజాలానికి నిదర్శనమని అన్నారు బిజెపి అనుసరిస్తున్న మనువాద భావజాలాన్ని ప్రజలందరూ అర్థం చేసుకోవాలన్నారు.బీసీ ప్రధానమంత్రిని అని చెప్తున్న నరేంద్ర మోడీ 42 శాతం బీసీ రిజర్వేషన్లను ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు మరోవైపు తెలంగాణ రాష్ట్రంలో కేంద్ర మంత్రిగా ఉన్న బండి సంజయ్ నిరంతరం బీసీ అని చెప్పుకునే ఈటల రాజేందర్ లు నోర్లు ఎందుకు మెదపడం లేదో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు 42% బీసీ రిజర్వేషన్లపై నోరు మెదపలేని అసమర్ధ బిజెపి ఎంపీలు వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు మెరుగు వెంకటేశం, కూర శ్రీనివాస్, కందడి సత్తిరెడ్డి, వాకిటి వెంకటరెడ్డి, మండల కమిటీ సభ్యులు మొగిలిపాక గోపాల్,కర్ణ కంటి యాదయ్య, కల్కూరి ముత్యాలు, దుబ్బ లింగం, కవిడే సురేష్, భీమనబోయిన జంగయ్య, భూమి మాధవి,పట్టణ కార్యదర్శి గర్దాసు నరసింహ,భూమి బాల శంకర్, మద్దెల మారయ్య,పట్టణ నాయకులు కొండూరు సత్తయ్య, వేముల నాగరాజు, మైసొల్ల నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఏఎంసి చైర్మన్ గంట జన్మదిన వేడుకలు

**తొవ్వ,కేసముద్రం, ఆగస్టు 05**
:కేసముద్రం మున్సిపాలిటీ కేంద్రంలో మంగళవారం కేసముద్రం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గంట సంజీవ రెడ్డి జన్మదినం సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షులు అల్లం నాగేశ్వర్ రావు ఆదేశాల మేరకు యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు అల్లం గణేష్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జన్మదిన వేడుకల్లో వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎండీ ఆయుబ్ ఖాన్,ధన్నసరి మాజీ ఉపసర్పంచ్ బానోత్ వెంకన్న ముఖ్య అతిథులుగా పాల్గొని కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ వీరన్న,గ్రామ పార్టీ అధ్యక్షుడు కొండా సురేష్,తరాల సుధాకర్,బ్లాక్ కాంగ్రెస్ కోశాధికారి మహమ్మద్ తాజోద్దీన్, ఎండీ నవాజ్ అహ్మద్,కమల్,మాజీ ఉప సర్పంచ్ రఫీ,మాజీ వార్డు మెంబర్ బాలు, ఎండీ, ఎలేందర్,రాజేష్,పిల్లి రమేష్, బోడా విక్కి,శ్రీనివాస్,జల్లంపల్లి శ్రీనివాస్, ఎండీ అలీమ్,సేవల్, భదవత్ శంకర్, ఆంగోత్ బాల, బాధ్య నాయక్, ఉప్పునూతల,శ్రీను,కోదండ పాణి, కళాధర్,ఎండీ సమీర్, కాత్రేవుల హరికృష్ణ,రాకేష్, అఖిల్,సంతోష్, సేవల్,చందు, చంటి తదితరులు పాల్గొన్నారు.



# ఆకస్మికంగా తనిఖీ చేసిన కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం డాక్టర్ సాంబశివరావు.



**తొవ్వ, ప్రతినిధి, ఖానాపూర్, ఆగస్టు, 05::**
జిల్లా వైద్య ఆరోగ్య డాక్టర్ సాంబశివరావు అశోక్ నగర్ లోని కస్తూరిబాగాం ధీబాలికలవి ద్యాలయాన్నిసందర్శించి కిశోర రక్ష ప్రోగ్రాం జరుగుతున్న విధానాన్ని పర్యవేక్షించారు .ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఈ ప్రోగ్రాం ని విద్యార్థులందరికీ పరీక్షలు చేసి వారి ఆరోగ్య విషయాలను హెల్త్ ప్రొఫైల్ కార్డులో రాయాలని అందరికీ అన్ని పరీక్షలు చేసి నమోదు చేయాలని కోరారు. ప్రతి విద్యార్థి యొక్క ఆరోగ్యం శారీరకంగా మానసికంగా బాగున్నప్పుడే మంచి ఫలితాలు వస్తాయని పలు పరీక్షల ద్వారా పోషకాహార లోపం వల్ల కానీ ఇతరేమైనా అనారోగ్య సమస్యలున్నా కూడా వాటికి తగిన విధంగా మందులు కానీ ఆరోగ్య విద్య ద్వారా గాని రిఫరల్ సర్వీస్ ద్వారా కాని వారిని ఆరోగ్యవంతులుగా చేయడం దీని యొక్క ముఖ్య ఉద్దేశ్యం అని తెలిపారు.తర్వాత హాస్టల్లోని స్టోర్ రూమ్ ,వంటగది భోజన శాలమొదలగు వాటిని సందర్శించారు.ఈ కార్యక్రమంలో పల్లె డాక్టర్ కల్పన, ఆర్ బి ఎస్ కే డాక్టర్ రవీందర్,హెల్త్ సూపర్వైజర్ దామోదర్ రెడ్డి ల్యాబ్ టెక్నీషియన్ నవీన్ ఎన్ సి డి నర్సింగ్ ఆఫీసర్ సబితవైద్య సిబ్బంది రమాదేవి రమ్య,దివ్య, అన్నపూర్ణ ప్రిన్సిపాల్ మేనక మరియు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# గీతాంజలి విద్యాసంస్థల చైర్మన్ గారికి విద్యార్థి నాయకులు సన్మానం



**తొవ్వ, ప్రతినిధి, నర్సంపేట, ఆగస్టు,05:**
నర్సంపేట లోని గీతాంజలి విద్యాసంస్థల. చైర్మన్ డాక్టర్ వేములపల్లి సుబ్బారావు మంగళవారం విద్యార్థి నాయకులు ఆధ్వర్యంలో ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నప్పుడే పేద పిల్లల పైన ప్రేమ చూపుతూ పిల్లల బంగారు భవిష్యత్తు తీర్చిదిద్దిన పేద పిల్లల కోసం ఇంకెన్నో సామాజిక సేవలు అందించాలని నిరంతరం ప్రజలపై ప్రేమ చూపుతూ కార్పొరేట్ స్థాయిలో పేద పిల్లలకు విద్యను అందిస్తూ తక్కువ ఫీజులతో విద్యను అందిస్తున్నారు పాఠశాలలో చదువుతున్న తల్లిదండ్రులు కోల్పోయిన పిల్లల కు ఉచితం విద్యను అందిస్తూ ఖానాపురం, నర్సంపేటలో ప్ర భుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు స్టడీ మెటీరియ ల్ అందించి పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతు న్నందుకు ఇటీవల కేంద్ర ప్రభుత్వం గౌరవ డాక్టరేట్ను సు బ్బారావుకు అందచేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు యుఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మొగిలిచర్ల సందీప్ ఎం ఎఫ్ ఎస్ జిల్లా అధ్యక్షుడు చింతం సిద్ధూ తదితరులు పాల్గొన్నారు

# రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం లోముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి







**తొవ్వ, ప్రతినిధి, నర్సంపేట, ఆగస్టు, 05:**
నర్సంపేట నియోజకవర్గంలోని దుగ్గొండి,నల్లబెల్లి మండలాల్లో నేడు రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి గారు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.దుగ్గొండి మండలంలో మొత్తం 1640 నూతన కార్డులు అందించారు.అదే విధంగా నల్లబెల్లి మండలంలో మొత్తం 1241న ూతనకార్డులుఅ ందించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ నేటికి నియోజకవర్గంలో మొత్తం 12273 రేషన్ కార్డులు అందించామని,మరిన్ని రేషన్ కార్డులు ఆమోదం కొరకు జిల్లా,రాష్ట్ర స్థాయిలో పరిశీలనలో ఉన్నాయని,వాటిని కూడా త్వరలో అందిస్తామని తెలిపారు.రేషన్ కార్డులతో పాటు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం సన్న బియ్యాన్ని కూడా పంపిణీ చేస్తున్నామనిఅన్నారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒకటి రెండు ఆలస్యమైనప్పటికీ ఇచ్చినా వాగ్దానాలను ప్రజా ప్రభుత్వం అమలు చేస్తుందని అన్నారు.కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, ఆర్డీవో ఉమారాణి, జిల్లా పౌర సరఫరాల అధికారి కిష్టయ్య, పీసీసీ సభ్యులు పెండెం రామానంద్,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాస్ రెడ్డి,ఇతర నాయకులు, మండల అధికారులు పాల్గొన్నారు.

## 11 ఏళ్ల మోది పాలనలో కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన

# సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించండి

**బిజెపి రాష్ట్ర క్రమశిక్షణ సంఘం కమిటీ చైర్మన్,మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు పిలుపు**

**తొవ్వ,కేసముద్రం, ఆగస్టు 05**

:మహా సంపర్క్ అభియాన్ లో భాగంగా మంగళవారం మండల అధ్యక్షుడు ఉప్పునూతల రమష్ ఆద్వర్యంలో కేసముద్రం స్టేషన్ లోని 56 వ బూత్ అధ్యక్షుడు సింగంశెట్టి మధుకర్ అధ్యక్షతన నిర్వహించిన ఇంటింటికి బిజెపి%-%ప్రతి ఇంటికి పోలింగ్ బూత్ అధ్యక్షుడు కార్యక్రమానికి ముఖ్య తిధిగా బిజెపి రాష్ట్ర క్రమశిక్షణ సంఘం కమిటీ చైర్మెన్,మాజీ ఎమ్మెల్యే మర్తినేని ధర్మారావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ధర్మారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విజయాలను, ఇంటింటికి బిజెపి%-%ప్రతి ఇంటికి పోలింగ్ బూత్ అధ్యక్షుడు కలిసి వివరించాలని అన్నారు.గత 11 సంవత్సరాలుగా, కేంద్రంలోని బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వం ప్రాథమిక పారిశ పారిశుధ్యం నుండి అంతరిక్ష పరిశోధన వరకు బహుళ రంగాలలో ముందుకు సాగిందని ధర్మారావు చెప్పారు ప్రతి ఇంటికి వెళ్లి నాయకులు, కార్యకర్తలు ప్రధాని నరేంద్ర మోదీ పాలనలో సాధించిన ప్రగతిని,చేపట్టిన అభివృద్ధి పనులు,సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. ప్రతీ బూత్ కమిటీ అధ్యక్షుడు కనీసం 100 ఇళ్లను సందర్శించి, ప్రధాని మోదీ సందేశం అందించాలనన్నారు. మద్దతు తెలిపేందుకు 92400 15366 మిస్డ్ కాల్ నంబర్ ప్రజలకు అందుబాటులో ఉందన్నారు అలాగే రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, నెరవేర్చని హామీలపై ప్రజలకు వివరించేలని కార్యకర్తలను కోరారు."గత దశాబ్దంలో వ్యవసాయం,పరిశ్రమలు, ఎంఎస్ఎంఈలు,రైల్వేలు, రోడ్డు మార్గాలు మరియు సాంకేతికత వంటి వివిధ రంగాలలో నరేంద్ర మోడీ ప్రభుత్వం చేపట్టిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికి తీసుకెళ్లాల్సిన అవసరాన్ని నేను నొక్కి చెప్పాను. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో, కేంద్ర ప్రాయోజిత పథకాలు మరియు ప్రాజెక్టులు అర్హులైన జనాభాకు చేరేలా,అట్టడుగు స్థాయి అభివృద్ధికి మరియు అందరి సాధికారతకు దోహదపడేలా కార్యకర్తలు నిర్వహించాలని అన్నారు . గడపగడపకూ బిజెపి సందేశాన్ని చేరవేస్తూ బిజెపి నాయకులు,కార్యకర్తలు ప్రజలతో ప్రత్యక్షంగా మమేకమయ్యారు.గడప గడపకు వెళ్లి 11 ఏళ్ల మోదీ పాలనలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించడం జరిగింది.కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజల పట్ల చేస్తున్న మోసాలను వివరిస్తూ పండ్ల వ్యాపారులను కలసి యుపీఐ పేమెంట్స్ ఎలా జరుగుతుంది అని వివరిస్తూ,ముద్ర లోన్ల లబ్దిదారులును కలసి వివరాలు తెలుసుకున్నారు వారికి మోడీ ప్రభుత్వ విజయాల కరపత్రాలను పంపిణీ చేయడం జరిగింది.తెలంగాణ ప్రజలను వంచిస్తున్న కాంగ్రెస్ పార్టీకి వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బుద్ధి చెప్పి బిజెపికి అండగా నిలవాలని ప్రజలను కోరడం జరిగింది.పార్టీ జిల్లా అధ్యక్షుడు వల్లబు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ పాలనలో సాధించిన ప్రగతిని,చేపట్టిన అభివృద్ధి పనులు,సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడమే కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించడానికి చేపట్టిన కార్యాచరణగా తెలిపారు.ఈ కార్యక్రమలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వద్దిరాజురామచంద్రరావు,జిల్లా కౌన్సిల్ మెంబర్ పొదిల నరసింహారెడ్డి,మండల అధ్యక్షులు,ఉప్పునూతుల,రమేష్,మండల ప్రధాన కార్యదర్శిలు,బోగోజు నాగేశ్వర చారి,భువనగిరి ఉపేందర్, మండల ఉపాధ్యక్షులు, కొండపల్లి మహేందర్ రెడ్డి, చలగోల వెంకటేష్, నాగనబోయిన చంద్రకళ, మండల నాయకుల గాంతి వెంకట్ రెడ్డి,దళిత్ మోర్చా నాయకుల పూర్ణకంటి భాస్కర్,సీనియర్ నాయకుల మల్యాల రాములు,మంగ వెంకన్న,సింగంశెట్టి మధు, పోలేపల్లి సంపత్ రెడ్డి, మంగిశెట్టి నాగయ్య,బండి వెంకన్న జంగిటి అనిల్, మందుల ప్రభాకర్,బానోత్ సంపత్, జాటోత్ నరేష్, దొంతరబోయిన భరత్,జుజ్జురి వీరభద్ర చారి తదితరులు పాల్గొన్నారు.

## మునిపంపుల ప్రభుత్వ ఆసుపత్రిని 24 గంటల ఆసుపత్రిగా మార్చాలి

**సిపిఎం మండల కార్యదర్శి వర్గ సభ్యురాలు జంపాల అండాలు**



**యాదాద్రి జిల్లా: రామన్నపేట: తొవ్వ ప్రతినిధి :ఆగస్టు 5**

రామన్నపేట మండల పరిధిలోని మునిపంపుల ప్రభుత్వ సుపత్రిలో 24 గంటల వైద్య సౌకర్యం అందేలా చేసి పరిసర గ్రామాల గర్భిణీ స్త్రీల ప్రయోజనార్థం గైనకాలజిస్టును నియమించి వైద్య సౌకర్యం అందించాలని సిపిఎం మండల కార్యదర్శివర్గ సభ్యురాలు జంపాల అండాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం సిపిఎం గ్రామ మహిళా శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ గత 20 సంవత్సరాల క్రితం ఏర్పడిన ప్రభుత్వ ఆసుపత్రిలో 24 గంటల వైద్య సౌకర్యం లేక పరిసర గ్రామాల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. సుమారుగా 14 గ్రామాలకు కేంద్రమైన ప్రభుత్వాసుపత్రిలో ఒకే డాక్టరు ఉండడంతో పేదలకు మెరుగైన వైద్యం అందడం లేదన్నారు. మండల కేంద్రం దూరంగా ఉండడంతో అత్యవసర వైద్యం కలిగినప్పుడు రాత్రిపూట ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుందని అన్నారు. కనీస మౌలిక సదుపాయాలు లేక ఫర్నిచర్ వంటివి కూడా లేక ఇబ్బందులు పడుతున్నారని, డాక్టర్ సొంత డబ్బులతో ఖర్చు పెట్టి కొనుక్కుంటున్నామని సమాధానం ఇస్తున్నారని అన్నారు. ప్రతి నెల ఆశా వర్కర్లు సమావేశం జరుపుతారు కనీసం కూర్చోవడానికి షెడ్డు లేకపోవడంతో చెట్ల కిందే కాలమెల్ల తీయాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ఖాళీగా ఉన్న నర్సు పోస్టును భర్తీచేయాలని, డాక్టర్లు నిరంతరం స్థానికంగా ఉండాలని అన్నారు. జిల్లా కలెక్టర్ వెంటనే ఆసుపత్రిని సందర్శించి ఆసుపత్రిని 24 గంటల ఆసుపత్రిగా మార్చి ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రజలతో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మహిళా శాఖ నాయకులు తాళ్లపల్లి హేమలత,బొడ్డుపల్లి సంధ్య, కుక్కడపు ఎల్లమ్మ, అప్పం విజయ,గంటెపాక అశ్విని, బోనగిరి మౌనిక తదితరులు పాల్గొన్నారు.

## జయపురం పాఠశాల విద్యార్థులకు టై, బెల్ట్‌లు పంపిణీ

**మాజీ సర్పంచ్ మందుల యాకన్న**




**తొవ్వ, నర్సింహులపేట. ఆగస్టు. 05**

నర్సింహులపేట మండలంలోని జయపురం గ్రామ ప్రభుత్వ పాఠశాల లో సుమారు 80 మంది విద్యార్థులకు ఎనిమిది వెయ్యిల రూపాయలు విలువ చేసే టై బెల్ట్ లు మందుల చుక్కమ్మ గారి జ్ఞాపకార్థం వారి కుమారుడు మాజీ సర్పంచ్ మందుల యాకన్న పాఠశాలలోని విద్యార్థినీ విద్యార్థులకు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఓ వెంకటయ్య మాట్లాడుతూ పాటశాలకు ఎలాంటి అవసరం ఏర్పడిన గ్రామస్తులు సహాయం చేయడంలో ముందుంటారని, విద్యార్థులకు టైం, బెల్ట్ లు అందజేయడం చాలా సంతోషంగా ఉందని, ఉపాధ్యాయులతో కలిసి మందుల యాకన్నకు శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలియజేశారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఈఓ రాంమోహన్ రావు హాజరై మాట్లాడుతూ ప్రయివేటు పాఠశాలలకు దీటుగా, ప్రభుత్వ పాఠశాలల్లో తగిన అర్హతలు, మంచి అనుభవం ఉన్న ఉపాధ్యాయులచే విద్యా బోధన అందిస్తున్న మని, ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా రెండు జతల ఏకరూప దుస్తులు, పాఠ్య పుస్తకాలు, రాత పుస్తకాలు, మధ్యాహ్న భోజన పథకంలో పౌష్టిక ఆహారాన్ని అందిస్తున్నానమని, విద్యార్థుల తల్లిదండ్రులు ఆలోచించి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి వెంకట్రాం, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ అధ్యక్షురాలు మందుల ఉపేంద్ర, రిటైర్మెంట్ పీఈటీ నెలకుర్తి, వీరారెడ్డి, మాజి ఎస్ఎంఎస్ చైర్మన్ రావుల శ్రీనివాస్, చెన్నారెడ్డి, పీఆర్పీ లు వీరన్న,రవి ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు

## ఉపాధి హామీ పథకం పనుల పరిశీలనకై కేంద్రం బృందం రాక

**తొవ్వ. నెల్లికుదురు, ఆగస్టు 05**

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, లో చేపట్టిన పనులతో పాటు ప్రభుత్వం చేపడుతున్న ఆయా పనుల పరిశీలనకై జాతీయ గ్రామీణ జీవనోపాధి సంస్థ ఆధ్వర్యంలో కేంద్ర బృందం బుధవారంమండలంలోని పలు గ్రామాల్లో పర్యటించనున్నట్లు స్థానిక ఎంపీ ఓ బానోత్ పద్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని ఆయా గ్రామాల్లో ఉపాధి హామీ పథకంలో నిర్వహిస్తున్న 7 రిజిస్టర్లు, జాబ్ కార్డ్స్, నర్సరీ, ప్రతి రెండవ శుక్రవారం గ్రామాల్లో నిర్వహించేఉపాధి రోజువారిదివాస్ కార్యక్రమ వివరాలు, తో పాటు సీసీ రోడ్ల నిర్మాణం, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న వివిధ పథకాల అమలు తీరుపై కేంద్ర బృందం తనిఖీ చేయనున్నట్లు ఆమె తెలిపారు ఇందుకు సంబంధించిన ఆయా శాఖల ఉద్యోగులు తమ తమ నివేదికలతో సిద్ధంగా ఉండాలని తెలిపారు. లేనట్లయితే శాఖా పరమైన చర్యలు తప్పవన్నారు.

## మద్యానికి బానిసైన అనారోగ్యంతో వ్యక్తి మృతి

**తొవ్వ,గార్ల ఆగస్టు 05**

గార్ల మండల పరిధిలోని పాత పోచారం గ్రామానికి చెందిన షేక్ అంకుష్ 41సం"గత ఐదు సంవత్సరాలు నుండి మద్యానికి బానిసైన అందులోనూ పక్షవాతానికి గురి అయి అప్పటి నుంచి మందులు వాడుతూ ఇంటి వద్దే ఉంటూ జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో రెండో తేదీన గడ్డి మందు తాగగా వెంటనే కుటుంబ సభ్యులు చూసి చికిత్స నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొని వచ్చి జాయిన్ చెయ్యగా మంగళవారం చికిత్స పొందుతూ ఉదయం 11 గంటల సమయంలో మృతి చెందినట్లు మృతుని అన్న షేక్ రఫీ ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శవాన్ని పంచనామా చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ ఐ రియాజ్ పాషా అన్నారు.

## న్యాయవాదిగా ప్రజలకు న్యాయ సేవలు అందించడం గర్వకారణం.. హైకోర్టు న్యాయవాది నర్రి స్వామి

**తొవ్వ, ఆగస్టు 5. సంవత్సరాల :**



మునుగోడు నియోజకవర్గం, నారాయణపురం మండలం, మల్లారెడ్డిగూడెం వాస్తవ్యుడు హైకోర్టు న్యాయవాది నర్రి స్వామి కురుమ రాష్ట్రవ్యాప్తంగా మాత్రమే కాక దేశవ్యాప్తంగా న్యాయవాది ప్రాక్టీస్ లో భాగంగా కర్ణాటక రాష్ట్రం పోయి వచ్చిన సందర్భంగా విలేకరులు కలిసినప్పుడు నర్రి స్వామి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రాక్టీస్ చేస్తూ నే దేశంలో ఏ మూలలో ఈ కేసైనా నా ప్రాంతం ప్రజలకు న్యాయ సేవ అందించడానికి నిరంతరం చేస్తానని అందులో భాగంగా బెంగళూర్, ఢిల్లీ మధ్యప్రదేశ్ అనేక రాష్ట్రాల్లో కేసులను వాదిస్తున్నామని తెలియజేశారు అనేకమంది మునుగోడు నియోజకవర్గానికి చెందిన కక్షిదారులు మాట్లాడుతూ నర్రి స్వామి ఈ ప్రాంతంలో పుట్టిన బిడ్డ ప్రతి ఒక్కరికి న్యాయ సేవలు అందించడం చాలా అభినందనీయం అన్నారు

## అర్బన్ బ్యాంక్ పరువు దెబ్బతీయొద్దు

### కక్షపూరిత ఆరోపణలు

**ఎంక్వైరీ జరగకుండా సభ్యత్వాలు రద్దు చెల్లెదు**

**గతాన్ని మరిచి, అభివృద్ధికి కృషి చేయండి**

**బ్యాంక్ గౌరవాన్ని కాపాడదాం**

**విలాస్ రెడ్డి ఆరోపణలు నిరాధారమన్న మాజీ పాలకవర్గం**

**మాజీ చైర్మన్ రాజశేఖర్**

**కరీంనగర్ బ్యూరో, ఆగస్ట్ 05, :**

కరీంనగర్ అర్బన్ బ్యాంక్ పీఏసీ కమిటీ చైర్మన్ గడ్డం విలాస్ రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలు బ్యాంక్ పరువును దెబ్బతీసే విధంగా ఉన్నాయని, అవి పూర్తిగా నిరాధారమైనవని మాజీ చైర్మన్ కర్ర రాజశేఖర్ రెడ్డి మండిపడ్డారు. మంగళవారం తారక్ హోటల్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.2007 నుంచి 2017 వరకు చెయర్మన్‌గా, 15 మంది సభ్యులతో పాలకవర్గంగా పనిచేశామని గుర్తు చేసిన రాజశేఖర్ రెడ్డి, తమ పాలనపై ఇప్పుడెందుకు ఆరోపణలు చేస్తున్నారని ప్రశ్నించారు. గత నెల 27న జరిగిన జనరల్ బాడీ మీటింగ్ కోరమ్ లేకుండా వాయిదా పడిందని, ఈ నెల 3న మరోసారి 208 మంది సభ్యులతో సమావేశం పెట్టినా అదే పరిస్థితి ఎదురైందని తెలిపారు. సహకార చట్ట ప్రకారం ఈ సమావేశాలకు చట్టబద్ధత లేదని స్పష్టం చేశారు.తమపై ఇప్పటివరకు ఎలాంటి చట్టబద్ధమైన విచారణ కూడా జరగలేదని, ఎనిమిదేళ్లుగా ఎంక్వైరీ లేదు అని పేర్కొన్నారు. బ్యాంకులో ఓవర్‌రైటింగ్ జరిగిందన్న ఆరోపణలకు తాము బాధ్యులు కాదని, మెంబర్షిప్ బుక్స్ సీఈఓ వద్ద ఉంటాయని తెలిపారు. అప్పుడు పనిచేసిన రాజారాం రెడ్డి అనే సీఈఓపై తాము చర్యలు తీసుకున్నామని, ఆయన కోర్టు ద్వారా తిరిగి ఉద్యోగంలోకి వచ్చారని వివరించారు.2017 లో ఇచ్చిన సభ్యత్వాల విషయంలో అప్పట్లో అకౌంట్ ఉన్నవారికే ఇవ్వాలనే నిబంధన లేదని, ఏ సభ్యుడికైనా ఇవ్వొచ్చని తేల్చిచెప్పారు. నోటీసు ఇవ్వకుండా తమ సభ్యత్వాలు రద్దు చేయడాన్ని ఖండించారు. 1982లో బ్యాంక్ కార్యకలాపాలు ప్రారంభమైనప్ప టినుండి 25 ఏళ్లలో 24 కోట్లు మాత్రమే డిపాజిట్ కాగా, తమ పాలనలోనే 60 కోట్ల డిపాజిట్లు వచ్చాయని వివరించారు. 2017 తర్వాత 8 ఏళ్లలో కేవలం 10 కోట్లు మాత్రమే పెరిగాయని తేల్చిచెప్పారు.విలాస్ రెడ్డికి మా మెంబర్షిప్ రద్దు చేసే హక్కు లేదు. కోర్టు ఆర్డర్ వస్తే అక్కడ తేల్చుకుంటాం. గతంలో ఓడి మళ్లీ రాజకీయ కక్షతో ఆరోపణలు చేయొద్దు. బ్యాంక్ అభివృద్ధికి సహకరించండి అని హితవు పలికారు. వ్యక్తిగత రాజకీయాలకంటే బ్యాంక్ భవిష్యత్తే ముఖ్యమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మాజీ పాలక వర్గం సభ్యులు బా శెట్టి కిషన్ ,వరాల జ్యోతి, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

## కాలేశ్వరం పై అవినీతిని కప్పిపుచ్చుకునేందుకు బిఆర్ఎస్ డ్రామాలు

**జస్టిస్ ఘోష్ నివేదికపై చర్చకు సిద్ధమా స్థానిక ఎన్నికలపై లబ్ధి కోసం ప్రభుత్వం పై నిందలు**

**రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ అండ్ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి**

**గోదావరిఖని , ఆగస్టు 5**

కాలేశ్వరంపై జస్టిస్ పిసి ఘోష్ ఇచ్చిన నివేదికపై టిఆర్ఎస్ నాయకులు చర్చకు సిద్ధమా అని రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ అండ్ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సవాల్ విసిరారు.మంగళవారం గోదావరిఖని తిలక్ నగర్ సెంటర్ లోని కాంగ్రెస్ పార్టీ 44వ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఎండీ ముస్తఫా నివాసంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.కన్నెపల్లి పంప్ హౌజ్ వద్ద బిఆర్ఎస్ నేతలు మళ్లీ పాత డ్రామాలను ఆడే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు.పదేళ్ల పాటు అధికారంలో ఉండి కాళేశ్వరం ప్రాజెక్ట్ పేరుతో రూ.లక్షల కోట్లు అవినీతికి పాల్పడ్డ గులాబీ నేతలు మళ్లీ ప్రజలను మోసం చేయాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రాజెక్ట్‌లో ఏర్పడిన అనేక లోపాలను దేశంలోనే నిపుణులైన ఎన్ డి ఎస్ ఏ వెల్లడించిందని గుర్తు చేశారు.జస్టిస్ ఘోష్ ఇచ్చిన నివేదిక ప్రకారం ప్రత్యేక అసెంబ్లీ ఏర్పాటు చేసి బీఆర్ఎస్ అవినీతి ప్రజలకు బహిర్గతం చేస్తామని స్పష్టం చేశారు.ఉమ్మడి కరీంనగర్,ఆదిలాబాద్ జిల్లాల్లో కాళేశ్వరం ప్రాజెక్ట్ ద్వారా రైతులకు ఎంత సాగునీరు ఇచ్చారో బీఆర్ఎస్ నేతలు ఖచ్చితంగా చెప్పగలరా అని ప్రశ్నించారు.



# సోనూ సూద్ రుణం జీవితంలో తీర్చుకోలేము..

## అంత్యక్రియలు, దశదిన కర్మకి డబ్బులు ఇచ్చారు..



సినిమాల్లో ఎవరైనా హీరోగా కనిపించొచ్చు. కానీ నిజ జీవితంలో హీరో అనిపించుకోవాలంటే అంత ఆషా మాషి కాదు. ఎదుటి వ్యక్తి బాధను తనదిగా భావిస్తూ, వారికి అండగా నిలవాలంటే ఎంతో మంచి మనసు ఉండాలి. అలాంటి అరుదైన వ్యక్తిత్వం కలిగిన వ్యక్తి సోనూసూద్. వెండితెరపై విలన్ పాత్రలు పోషించినా, జీవితంలో మాత్రం ఆయన కన్నా గొప్ప రియల్ హీరో ఇండస్ట్రీలో చాలా కొద్దిమందే.ఎవరైన సమస్యలో ఉన్నారన్న సమాచారం తెలిసింది అంటే చాలు వెంటనే తన టీమ్‌ను పంపించి వారి పరిస్థితి తెలుసుకుంటారు, అవసరమైన సాయం చేసేవరకు వెనకడుగు వేయరు. కరోనా కాలంలో ఆయన చేసిన సేవలు అంతర్జాతీయంగా ప్రశంసలు పొందినవే. ఆ సమయంలో చాలా మంది అతనిని “రియల్ హీరో”గా కొలిచారు. అనారోగ్యంతో ఇటీవల మృతిచెందిన టాలీవుడ్ నటుడు ఫిష్ వెంకట్ కుటుంబాన్ని సోనూసూద్ స్వయంగా పరామర్శించారు. వెంకట్ మరణించిన సమయంలో విదేశాల్లో ఉన్న ఆయన, వెంటనే వీడియో కాల్ ద్వారా కుటుంబాన్ని ఓదార్చారు. వచ్చి తప్పకుండా కలుస్తాను అని మాటిచ్చిన ఆయన, ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. వెంకట్ నివాసానికి వెళ్లిన సోనూసూద్, వెంకట్ చిత్రపటానికి నివాళులర్పించి, అతని భార్య, పిల్లలను పరామర్శించారు. వెంకట్ నాకు సోదరుడి లాంటి వాడు. అతని కుటుంబం ఇప్పుడు నా కుటుంబమే. ఏ సహాయం కావాల్సినా నేరుగా నాకు చెప్పండి అంటూ తన వ్యక్తిగత నంబర్‌ను కూడా ఇచ్చారు. వెంకట్ కుమార్తె స్రవంతి మీడియాతో మాట్లాడుతూ, సోనూసూద్ సార్ చేసే సాయానికి ఎంత చెప్పినా తక్కువే. మా ఇంటి నిర్మాణ బాధ్యతను తన భుజాల మీద వేసుకున్నారు. నాన్న దశదిన కర్మలకు రూ. లక్షన్నర ఇచ్చారు. ఆర్థికంగా ఆ సాయం చేయకపోతే దశదిన కర్మ అంత గ్రాండ్‌గా జరగేది కాదు. జీవితాంతం ఆయనకి రుణపడి ఉంటాం అంటూ భావోద్వేగానికి గురయ్యారు. విలన్ పాత్రల్లో క్రూరంగా కనిపించినా, సోనూసూద్ హృదయం మాత్రం అపారమైన మానవత్వంతో నిండి ఉంది. బాధలో ఉన్నవారికి అండగా నిలబడే ఆయన సహాయాలు ఎంతోమందికి బతుకుల్లో వెలుగునిచ్చాయి. ఇప్పుడు ఫిష్ వెంకట్ కుటుంబానికి ఇచ్చిన ఆత్మీయ మద్దతు ఆయనను మరోసారి రియల్ హీరోగా నిలబెట్టింది.

# మూడేళ్లుగా పరారీలో ఉన్న హీరోయిన్..

## ఎట్టకేలకి అదుపులోకి తీసుకున్న పోలీసులు

కోలీవుడ్‌లో తరచూ వివాదాలకు కేంద్రబిందువైన నటి మీరా మిథున్ మరోసారి వార్తల్లోకి ఎక్కింది. మూడేళ్లుగా పరారీలో ఉన్న ఆమెపై చెన్నై కోర్టు తాజాగా అరెస్ట్ వారెంట్ జారీ చేసిన విషయం తెలిసిందే. వెంటనే అరెస్ట్ చేసి ఈ నెల 11వ తేదీన కోర్టులో హాజరు పరచాలని చెన్నై సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి. అయితే తాజాగా నటి మీరా మిథున్‌ని ఢిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. మూడేళ్లుగా పరారీలో ఉన్న ఆమెను ప్రస్తుతం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఢిల్లీలో ఉన్న మీరా మిథున్‌ను రక్షించి అప్పగించాలంటూ ఆమె తల్లి దాఖలు చేసిన పిటిషన్ సోమవారం కోర్టులో విచారణకు వచ్చింది దాంతో చెన్నై లీగల్ సర్వీసెస్ అథారిటీ ద్వారా ఢిల్లీలో ఉన్న లీగల్ సర్వీసెస్ అథారిటీకి ఇచ్చి, ఢిల్లీ పోలీసుల సాయంతో ఆమెను గుర్తించి అక్కడున్న ప్రభుత్వ హోంలో ఉంచినట్లు పోలీసులు చెప్పుకొచ్చారు. కాగా, 2021 ఆగస్టులో మీరా మిథున్ తన సోషల్ మీడియాలో పెట్టిన ఒక వీడియో తీవ్ర దుమారాన్ని రేపింది. అందులో ఆమె ఎస్సీ, ఎస్టీ కులాలకు చెందిన వ్యక్తులపై కించపరిచే వ్యాఖ్యలు చేయడంతో పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తాయి. కొందరు దర్శకులు తన ఫోటోను అనుమతి లేకుండా వాడారని ఆరోపిస్తూ, కోలీవుడ్ నుంచి షెడ్యూల్డ్ కులాలవారిని తొలగించాలంటూ ఆమె చెప్పిన మాటలు తీవ్ర అభ్యంతరకరంగా మారాయి. ఈ వీడియో ఆధారంగా విడుతలై సిరుత్తైగళ్ పార్టీ నేత వన్నీ అరసు ఫిర్యాదు చేయగా, మీరా మిథున్ పై %ఖూజ% సెక్షన్లు 153, 153%ూ(1)(ఖ), 505(1)(బ%), 505(2) తో పాటు %ూజ/ూ% అట్రాసిటీ నిరోధక చట్టం కింద కేసులు నమోదయ్యాయి. అప్పట్లో మీరాతో పాటు ఆమె స్నేహితుడు శ్యామ్ అభిషేక్‌ను పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు పంపారు. అనంతరం బెయిల్‌పై విడుదలైన వీరిద్దరూ కోర్టు విచారణలకు గైర్హాజరయ్యారు , దాంతో కోర్టు సీరియస్‌గా తీసుకొని వారెంట్ జారీ చేసింది. అప్పటి నుంచే మీరా మిథున్ పరారీలో ఉంది. పోలీసులు ఎంత గాలించినా ఆమె ఆచూకీ కనిపించలేదు. నా కుమార్తె ఢిల్లీలో వీధుల్లో తిరుగుతోంది, దయచేసి ఆమెను రక్షించండి అంటూ మీరా తల్లి కోర్టులో పిటిషన్ దాఖలు చేయడంతో, ఈ కేసులో కీలక మలుపు చోటు చేసుకుంది. మీరా మిథున్ గతంలో నన్ను అరెస్ట్ చేసే హక్కు ఎవరికీ లేదు , నా మీద చేయి వేస్తే ఆత్మహత్య చేసుకుంటాను అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ప్రధాని మోదీ, తమిళనాడు సీఎం స్టాలిన్‌ను ట్యాగ్ చేస్తూ వీడియోలు రిలీజ్ చేయడం, పోలీసులపై ఆరోపణలు గుప్పించడం పెద్ద చర్చనీయాంశమయ్యాయి.

# నిజమైన బాణాలు వారే..

## త్రిబాణధారి బార్బరిక్ పై

## సత్యరాజ్ ఇంట్రెస్టింగ్ కామెంట్స్





టాలీవుడ్ డైరెక్టర్ మారుతి కాంపౌండ్ నుంచి వస్తోన్న చిత్రం త్రిబాణధారి బార్బరిక్ మోహన్ శ్రీవత్స దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీలో సత్యరాజ్ లీడ్ రోల్ రోల్‌లో నటిస్తుండగా..వశిష్ఠ ఎన్ సింహా, సంచి రాయ్ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే మైథలాజికల్ కాన్సెప్ట్‌తో వస్తోన్న ఈ సినిమా నుంచి సత్యరాజ్ పాత్ర లుక్‌తోపాటు టైటిల్ గ్లింప్స్‌ను షేర్ చేయగా సూపర్ హైప్ క్రియేట్ చేస్తోంది. తాజాగా ఈ మూవీ విడుదల తేదీని ఫైనల్ చేశారు. ఆగస్టు 22న గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల చేస్తున్నట్టు ప్రకటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఈవెంట్‌లో యాక్టర్ సత్యరాజ్ మాట్లాడుతూ.. త్రిబాణధారి బార్బారిక్ సినిమాకు పని చేయడం చాలా సంతోషంగా ఉంది. మా పాత్రలన్నీ ముఖ్యమైనవని మేమంతా చెప్పాలి.. కానీ సినిమాకు కథే రియల్ హీరో. ఈ చిత్రానికి డైరెక్టర్ మోహన్, నిర్మాత విజయ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ నిజమైన బాణాలు. ఈశ్వర్ నాతో డ్యాన్స్ చేయించాడు. రమేశ్ మా అందరినీ అద్భుతంగా చూపించాడు. డబ్బింగ్ చెబుతున్నప్పుడు ఇతర సీన్లను కూడా చూశా. కెమెరా యాంగిల్స్ ఎలాంటి సస్పెన్స్‌ను క్రియేట్ చేశాయో చూసి ఆశ్చర్యమేసింది. సస్పెన్స్ డైరెక్టర్, సినిమాటోగ్రఫర్ అద్భుతంగా తీర్చిదిద్దారంటూ చెప్పుకొచ్చాడు. మన సినిమాను వారి కెమెరాను ఆయుధంగా చేసుకుని ప్రేక్షకుల ముందుకు తీసుకెళ్లాల్సింది మీడియా.. అందువల్లే మీడియా మన బార్బారిక్ అన్నాడు డైరెక్టర్ మోహన్ శ్రీవాత్సవ. నీ వల్లే నీ వల్లే సాంగ్‌కు అద్భుతమైన స్పందన వచ్చింది.. అదే మా తొలి బాణం. రెండో బాణం అనగ అనగ. ఈ సినిమాను క్లారిటీ, కమిట్‌మెంట్, కంటెంట్‌తో తీయడం జరిగిందన్నాడు. మా సినిమాను మా బాస్ మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా విడుదల చేస్తున్నాం. సక్సెస్ చేయాలని కోరుతున్నానన్నాడు.

## ఓలే ఓలే గుంటా..

# నీ ఒళ్లోకొచ్చీ పంటా..

అగ్ర హీరో రవితేజ 75వ సినిమా ‘మాస్ జాతర’ ఈ నెల 27న విడుదల కానున్న విషయం తెలిసిందే. రచయిత భాను భోగవరపుని దర్శకుడిగా పరిచయం చేస్తూ సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మిస్తున్న ఈ చిత్రంపై ఆడియన్స్‌లో అంచనాలు భారీగానే ఉన్నాయి. విడుదల తేదీ దగ్గర పడుతుండటంతో ఈ సినిమా ప్రమోషన్‌ని మేకర్స్ వేగవంతం చేశారు. ఇందులో భాగంగా ఈ సినిమా నుంచి రెండో పాటను మంగళవారం విడుదల చేశారు. ‘ఓలే ఓలే గుంటా.. నీ అయ్య కాడ ఉంటా.. నీయమ్మ కాడ తింటా.. నీ ఒళ్లొకొచ్చీ పంటా..’ అంటూ సాగే ఈ ఊరమాస్ గీతాన్ని భాస్కర్ యాదవ్ రాయగా, భీమ్స్ సిసిరోలియో స్వరపరిచారు. రోహిణి సోరట్ ఆలపించారు. థియేటర్లలో ప్రేక్షకులతో సెప్పులు వేయించేలా మంచి మాస్ బీట్‌తో ఈ పాట సాగింది. రవితేజ, శ్రీలీల జోడి ఈ పాటతో మాస్‌ని మరోసారి ఆకట్టుకుంటుందని, ఇద్దరూ పోటాపోటీగా నర్తించి పాటను మరోస్థాయిలో నిలబెట్టారని మేకర్స్ చెబుతున్నారు. ఈ చిత్రానికి మాటలు: నందు సవిరిగాన, కెమెరా: విధు అయ్యన్న, సమర్పణ: శ్రీకర స్టూడియోస్, నిర్మాణం: సితార ఎంటైర్టైన్మెంట్స్, ఫార్చ్యూన్‌ఫోర్



Published and printed by; MUKESH VEERANTI.TEL NO;T/TG/619.2024.Cell no ;9398236146.8328649322.gmail.Thovvanews@gmail.com Head office:THOVVA NEWS.#5-70/5/4. PLOT NO 36.SAI MAHADEV NAGAR.PARVATHAPUR.MEDIPALLI. FIZADHIGUDAMEDCHAL MALKAJGIRI..Pin.5000399398236146